క్లుప్తంగా

అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధం



పెడన: అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధమని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ హైదర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెడన పీహెచ్‌సీ నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించి వైద్యాధికారి మాట్లాడారు. మేం ఇద్దరం, మాకు ఒక్కరు అన్న విధంగా ప్రతి కుటుంబం ఆలోచన చేయాలన్నారు. అబ్బాయి వివాహ వయస్సు 21 ఉండాలని చెప్పారు. ఇద్దరు వద్దు.. ఒక్కరే ముద్దు, చిన్న కుటుంబం చింత లేని కుటుంబం అన్న నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఎంపీహెచ్‌ఓ వీరయ్య, ఏఎన్‌ఎంలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియో థెరపీ

పెడన: దివ్యాంగులకు భవిత కేంద్రం వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ఫిజియో థెరపిస్టు ఎంఎస్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంపీపీ పాఠశాల (బంగ్లా స్కూల్)లోని భవిత కేంద్రంలో శారీరక అంగవైకల్యం ఉన్న బాలబాలికలకు ఫిజియో థెరపీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెడన పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం శారీరక వైకల్యం ఉన్న బాలబాలికలకు ఫిజియో థెరపీ నిర్వహిస్తామన్నారు. ఇక్కడ చేసిన విధంగా తల్లిదండ్రులు ఇంటి వద్ద కూడా చేయించాలని సూచించారు. భవిత ఆర్పీ ఎంకే నీలాంబరం, స్కూల్ హెచ్‌ఎం జి. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఫిర్యాదు



గూడూరు: వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గూడూరు మండల గ్రామ వలంటీర్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వలంటీర్లు దారం నవీన్, గుమ్మడి రత్నబాబు, రుద్రపాటి అనిల్, రాసంశెట్టి రవి, కుంభా నాగలక్ష్మి, జడా బాబూరావులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వలంటీర్ల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన జనసేనాని పవన్ కల్యాణ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ వి.వెంకటేష్‌కు వినతి పత్రం సమర్పించారు.

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు డివిజినల్ రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు మైక్ సెట్ సమకూర్చారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలతకు ఆయన మైక్ సెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో తన వంతు సహకారం అందించినందుకు సంతోషంగా ఉందన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

కోడూరు: కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. 33 కేవీ విద్యుత్ లైన్‌కు సంబంధించిన కొత్త ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఫీడర్లు ట్రిప్ కాకుండా, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అవసరమైన మరమ్మతులు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ మరమ్మతులు నిర్వహించడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంపై ఆగ్రహం

బంటుమిల్లి: ఉపాధి పథకంలో మండలంలో మూడేళ్లుగా మొక్కల పెంపకం చేస్తున్నప్పటికీ పర్యవేక్షణ లోపంపై ఎంపీపీ చినబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) మంగళవారంతో ముగిసింది. దీనిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడిట్ బృందం నివేదిక సమర్పించారు. పీడీ సూర్యనారాయణ, ఏపీడీ లక్ష్మీరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామాలలో పర్యటించిన డీఆర్‌పీలు నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా వెలువడిన పలు లోపాలను పురస్కరించుకుని సుమారు రూ. 1.11 లక్షలు రికవరీకి ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యంపై రూ. 21,600 జరిమానా విధించారు. ఎంపీడీఓ స్వర్ణభారతి, జెడ్పీటీసీ వెంకటరమణ, బాబూరావు అధికారులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన ఆగ్రహం

- వలంటీర్ల నిరసన, ఆందోళనలు
- మహిళలంటే చులకనభావం మరోసారి బయట పడింది
- పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలి
- లేకుంటే జనసేన పార్టీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం అంటూ హెచ్చరిక



మోపిదేవిలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



తాళ్లపాలెం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న వలంటీర్లు

మోపిదేవి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్లను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే లక్షలాది మంది వలంటీర్లతో జనసేన పార్టీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వలంటీర్లు హెచ్చరించారు. ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లను, ముఖ్యంగా మహిళా వలంటీర్లను టార్గెట్ చేస్తూ అవమానకరంగా మాట్లాడటంపై మోపిదేవి సచివాలయం-1 పరిధిలోని వలంటీర్లు మంగళవారం పవన్ కల్యాణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెదప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు మాట్లాడుతూ కేంద్ర నిఘా సంస్థ చెప్పిందని చెబుతున్న రిపోర్టును పవన్ కల్యాణ్ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా సీఎం జగనన్నను ఎదుర్కొనే ధైర్యం లేక వలంటీర్ వ్యవస్థను తక్కువ చేసిన మాట్లాడటం వల్ల పవన్ కల్యాణ్ రాజకీయం జీరో అయిందన్నారు. మూటలు మోసే ఉద్యోగమని వలంటీర్లను గతంలో చంద్రబాబు హేళన చేశారని, ఇప్పుడు వపన్ కల్యాణ్ ఏకంగా మహిళా లోకాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడంపై లక్షలాది మంది వలంటీర్ల కుటుంబాలు పూర్తిగా మిమ్మల్ని ద్వేషించేలా చేసుకున్నారని, వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వలంటీర్లతోపాటు సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు ఆది రాంబాబు, గరికిపాటి గోవిందరాజులు, లింగం జగదీష్‌కుమార్, గ్రామ కన్వీనర్ కారుమూరి తాతయ్య, కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు, ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

కోనేరుసెంటర్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు మంగళవారం తాళ్లపాలెం గ్రామంలో దహనం చేశారు. తాళ్లపాలెం సెంటర్‌కు వలంటీర్లు పెద్ద ఎత్తున చేరుకుని పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటీర్లకు పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ప్రాంతానికి వెళ్లినా అందరినీ ఆప్యాయంగా పలుకరించే వలంటీర్లకు దురుద్దేశాలను ఆపాదించడం క్షమించరాని నేరమన్నారు. కార్యక్రమంలో తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం, మంగినపూడి, తపసిపూడి, గోకవరం, సిరివెళ్లపాలెం, మేకవానిపాలెం, గోపువానిపాలెం గ్రామాలకు చెందిన వలంటీర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్ వలంటీర్లకు మద్దతు తెలిపారు.

కరోనా సమయంలో ఎనలేని సేవలు



కరోనా సమయంలో కుటుంబ సభ్యులు కూడా దగ్గరకు రాని సమయంలో వలంటీర్లే అన్ని విధాలా సాయం చేశారు. వలంటీర్ వ్యవస్థను నాడు అందరూ మెచ్చుకోగా, వవన్‌కల్యాణ్ కళ్లకు కనపడకపోవడం శోచనీయం. మహిళలపై చులకన భావం ఉంది కాబట్టే మూడు పెళ్లిళ్లు చేసుకుని వారికి అన్యాయం చేశావు. వలంటీర్లకు వెంటనే క్షమాపణ చెప్పాలి. లేకుంటే గుణపాఠం తప్పదు.

– వెన్న నాగలక్ష్మి, వలంటీర్

ప్రధాని మోదీ మెచ్చుకున్నారు



జగనన్న ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థను దేశ ప్రధాని నరేంద్ర మోదీ మెచ్చుకున్నారు. మహిళలను గౌరవించడం వవన్‌కు తెలియదు. ప్యాకేజీ కోసం చంద్రబాబు చెప్పిందే చేస్తున్నావు. అధిక శాతం జనసేనకు చెందిన మహిళలు కూడా వలంటీర్లుగా కొనసాగుతున్నారని గుర్తించకపోవడం దురదృష్టం.

– కారుమూరి కీర్తి, వలంటీర్

ఒక్క కేసూ నమోదు కాలేదు



గతంలో చంద్రబాబు వలంటీర్లను అవమాన పర్చగా.. ఇప్పుడు పవన్ కల్యాణ్ మహిళా వంటీర్లను అవమాన పర్చడాన్ని రాష్ట్రంలోని మహిళంతా ఆలోచించాలి. పవన్ కల్యాణ్ చెప్పినట్లు వలంటీర్లు డేటాను బయటి వక్తులకు ఇస్తే కేసులు నమోదయ్యేవి. అయితే రాష్ట్రంలో వలంటీర్లపై ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు కాలేదు. వలంటీర్లకు లభిస్తున్న ఆదరణతో ఏమి మాట్లాడుతున్నారో ప్రతిపక్ష నాయకులకు తెలియడం లేదు.

– ఆరిగ సుధాకర్, వలంటీర్

ప్రజలు నమ్మరు



మా పిల్లల కంటే వలంటీర్లు ఎంతో గౌరవంగా మాట్లాడతారు. ప్రతి నెలా తెల్లవారుజాము ఐదు గంటలకే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారు. అలాంటి వలంటీర్లను అవమానిస్తే పుట్టగతులుండవు. రాజకీయంగా సీఎం జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబుతో పవన్ కల్యాణ్ కలిసి వ్యవస్థలపై ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరు.

– కామిశెట్టి లక్ష్మీ నాంచారమ్మ, పింఛను లబ్ధిదారు

ఆంజనేయుడికి కూరగాయలతో అలంకరణ



మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామి వారిని కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ భక్త బృందం పర్యవేక్షించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 50 మందికి ఉద్యోగాలు



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో మంగళవారం హెటిరో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. 200 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. వీరికి హెటిరో ఫార్మా కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 50 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి టి. మధు, కంపెనీ ప్రతినిధులు విజయకుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్, రసాయన శాస్త్ర విభాగాధిపతులు డాక్టర్ డి. రామశేఖరరెడ్డి, కె. సీతాలు, జి. రవి పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

బంటుమిల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చేసిన పనులను పురస్కరించుకుని నాయకులు మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నరేంద్రమోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని రైల్వే, రోడ్లు, ఓడరేవు తదితర రంగాలకు కేటాయించిన నిధుల వివరాలను కరపత్రాల్లో వివరించారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు, కిరణ్‌గుప్తా, గంగరాజు, వెంకటేశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

పేదలకు జగనన్న సురక్ష వరం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వి.కొత్తపాలెంలో 740 మందికి సర్టిఫికెట్ల పంపిణీ



వి. కొత్తపాలెంలో సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



గూడూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సంగా మధు, జెడ్పీటీసీ సభ్యుడు సురేష్

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం వి.కొత్తపాలెం సచివాలయం వద్ద ఎంపీడీఓ పాండురంగారావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంలో రమేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలందిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి వారికి తక్షణమే న్యాయం జరిగాలనే ఉద్దేశంతో సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. జగనన్న పాలనలో కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వీటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వి.కొత్తపాలెం, మాచవరం, జయపురం పంచాయతీల పరిధిలోని 740 మంది లబ్ధిదారులకు ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను రమేష్‌బాబు చేతుల మీదుగా ఉచితంగా అందించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి, డీఎఫ్ఓ రాజశేఖర్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సర్పంచులు యలవర్తి నాంచారయ్య, తోట లక్ష్మీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, తహసల్దార్ లతీఫ్‌పాషా పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. కొక్కిలిగడ్డ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. అనంతరం 150 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. బొబ్బర్లంక సర్పంచ్ దొప్పలపూడి గంగాభవానీ, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఈఓపీఆర్డీ అరుణకుమారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ, ఎంపీటీసీ దిడ్ల రాణి, గ్రామ కన్వీనర్ రాయన సత్యనారాయణ, ముమ్మనేని అరవింద్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి

పెడన: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మంగళవారం మండలంలోని నందిగామ గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి 134 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి వెంకట రామానాయుడు, దావు భైరవలింగం, జేసీఎస్ ఇన్‌చార్జి బెజవాడ నాగబాబు, సర్పంచు బొడ్డు చినబాబు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈఓపీఆర్డీ జయరాము పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కంచాకోడూరు సచివాలయం పరిధిలో 459 మంది అర్హులైన వారికి వివిధ ధ్రువీకరణ పత్రాలు జారీ చేశామని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. మంగళవారం సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబులు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఆర్బీకే చైర్మన్ పర్లం పెదబాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, సర్పంచులు కోళ్ల హనుమంతరావు, బత్తిన సరిత, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి టీవీ భాస్కరరావు పాల్గొన్నారు.

వక్కలగడ్డలో 439 సర్టిఫికెట్ల పంపిణీ

వక్కలగడ్డ(చల్లపల్లి): స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ వల్లూరు ఉమా అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. గ్రామంలో వలంటీర్లు 500 దరఖాస్తులు స్వీకరించగా అధికార యంత్రాంగం సమిష్టి కృషితో తొలిరోజే 439 ఉచిత సర్టిఫికెట్లు జారీ చేశారు. ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు, డెప్యూటీ తహసీల్దార్ కుమార్, ఎంపీటీసీ మట్టా కోమలి, పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, ఈఓఆర్డీ అశోక్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

అర్జావారిపాలెం(మోపిదేవి): శ్రీకాళహస్తి సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తుంగల రమేష్‌బాబు, రాజ్యలక్ష్మీ దంపతుల భౌతిక కాయాలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం సందర్శించారు. వారి మృతదేహాలను స్వగ్రామం మండలంలోని అర్జావారిపాలెంకు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తుంగల రమేష్‌బాబు చిన్న కుమారుడు భరత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పండలనేని శివప్రసాద్, వెంకటేశ్వరరావు, అళ్ల జ్యోతి, మత్తి రాంబాబు, కూరేటి రత్తయ్య, గండు వెంకటేశ్వరరావు, అరజా వెంకటేశ్వరరావు ఉన్నారు.

ముగిసిన శ్రీలత అంత్యక్రియలు



వేకనూరు(అవనిగడ్డ): మూడు రోజుల కిందట శ్రీకాళహస్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జెన్యావుల శ్రీలత (42) అంత్యక్రియలు వేకనూరులో మంగళవారం నిర్వహించారు. వేకనూరుకు చెందిన గుడివాక చలపతికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వివాహాలు చేసుకుని 14 ఏళ్ల కిందట వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. పెద్ద కుమార్తె శ్రీలత ఉయ్యూరులో కర్రీ పాయింట్‌లో పనిచేస్తుండగా, రెండో కుమార్తె రాజ్యలక్ష్మి, భర్త రమేష్‌తో కలిసి విజయవాడలో నివాసం ఉంటున్నారు. ఆదివారం తిరుపతి నుంచి వస్తుండగా శ్రీకాళహస్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీలత, రాజ్యలక్ష్మీ, రమేష్‌తో పాటు మరో ముగ్గురు మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం శ్రీలత మృతదేహాన్ని స్వగ్రామం అయిన వేకనూరుకు తీసుకురాగా శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కడసారి శ్రీలత మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు, వేదపండితులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆషాఢ మాస పవిత్రోత్సవాలు రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో వేద పండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ నేతృత్వంలో ఉదయం గోపూజ, సుప్రభాతసేవ నిత్యార్చన, అన్నాభిషేకం, మూలమూర్తులకు, ఉత్సవ మూర్తులకు పట్టు పవిత్రముల సమర్పణ మహా నివేదన, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు చేశారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములు, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

కుష్ఠు నియంత్రణకు పటిష్ట చర్యలు

వైద్య ఆరోగ్య శాఖ ఏడీ డాక్టర్ యాస్మిన్



పెడన పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ యాస్మిన్

పెడన/బంటుమిల్లి: రాష్ట్రంలో కుష్ఠు వ్యాధిని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) డాక్టర్ యాస్మిన్ అన్నారు. మంగళవారం ఆమె పెడన, బంటుమిల్లి మండలాల్లో పర్యటించారు. పెడన పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి వైద్యాధికారి పర్వేజ్ హైదర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లెప్రసీ కంట్రోల్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఈ సర్వే గత నెల 22న ప్రారంభమైందని, ఈ నెల 25వ తేదీతో ముగుస్తోందని చెప్పారు. ఈ సర్వే ద్వారా 281 మంది కుష్ఠు బాధితులను గుర్తించామన్నారు. ఇప్పటికే 2,796 మంది కుష్ఠు బాధితులకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పీహెచ్‌సీలలోను, రిఫరల్ ఆస్పత్రుల్లోనూ చికిత్స అందిస్తున్నామని వివరించారు. అనంతరం పెడన నుంచి బంటుమిల్లి వెళ్లారు. అక్కడ జరుగుతున్న సర్వే తీరును ఆమె పరిశీలించారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఎ. వెంకట్రావు, డీఎన్‌పీఓ డాక్టర్ వేణుగోపాల్, డీపీఎంఓ అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

అవనిగడ్డ విద్యార్థిని ప్రతిభ



అప్పికట్ల బిందు అనూష (ఫైల్)

అవనిగడ్డ: ఇటీవల విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీడీఈఈసెట్ 2023)లో అవనిగడ్డ విద్యార్థిని అప్పికట్ల బిందు అనూష స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ మేరకు ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం వివరాలు వెల్లడించారు. ప్రగతిలో శిక్షణ తీసుకున్న బిందు అనూష మొత్తం 70 మార్కులకు గాను 68 మార్కులు సాధించడం ద్వారా స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారని కరస్పాండెంట్ సనకా పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుంది. బిందు అనూష తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడం గమనార్హం. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన బిందు అనూషను పలువురు అభినందించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మచిలీపట్నంటౌన్: నగరంలో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక డీ–2 నార్త్ సెక్షన్ పరిధిలో విజిలెన్స్ ఎస్ఈ అల్ఫ్రాన్స్, విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు, మచిలీపట్నం ఎలక్ట్రికల్ ఈఈ మన్నెం భాస్కరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. 31 బృందాలుగా అధికారులు విడిపోయి 1705 సర్వీసులను తనిఖీ చేశారు. అదనంగా లోడు వాడుతున్న వాణిజ్య, పరిశ్రమల 68 సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో లోపాలు ఉన్న మీటరు యజమానుల నుంచి రూ. 2.81 లక్షలు అపరాధ రుసుంగా వసూలు చేశారు. మండలంలో విద్యుత్ చౌర్యం చేస్తున్న నలుగురు వినియోగదారులకు రూ. 3.5 లక్షల మేర జరిమానా విధించారు. తనిఖీల్లో విద్యుత్ మచిలీపట్నం టౌన్ డీఈఈ కె. రామకృష్ణ, డీ–2 నార్త్ ఏఈఈ పి. సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెదపట్నంలో రక్షణ శిఖరం ఆవిష్కరణ

కోనేరుసెంటర్: బందరు మండలం పెదపట్నం గ్రామంలో రక్షణ శిఖరాన్ని విజయవాడ డయాసిస్ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మరియమాతను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఆరాధించాలన్నారు. గ్రామానికి చెందిన మందపాటి రాజారావు, ప్రభావతి దంపతులు సుమారు రూ. 25 లక్షలతో శిఖరాన్ని నిర్మించారు. రక్షణ శిఖరం నిర్మాణానికి సేవలు అందించిన సునంద్, రాజేష్, దినేష్, రజినీ, శాలినీలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), సర్పంచ్ గడిదేవి అనూష, మంగినపూడి పారిష్ ఫాదర్ రావిశాస్త్రి, అవుటుపల్లి ఫాదర్ రవి పాల్గొన్నారు.

నేడు దూడల అందాల పోటీలు

పెడన: దూడల అందాల పోటీలు పెనుమల్లి రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని పశుసంవర్ధకశాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. దూడలు ఆరోగ్యంతో పాటు అందంగా ఉన్న వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. పశువుల యాజమానులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

బాధితురాలికి నిత్యావసరాలు అందజేత



మచిలీపట్నంటౌన్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొడుగుపేటకు చెందిన వంటమేస్త్రి దేశి శివకృష్ణ భార్య కనకదుర్గకు మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు రూ.4 వేల నగదు, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.